### ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా..

# పోలీసుల కవాతు

బంజారాహిల్స్,అక్టోబర్ 30: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడంతో పాటు ప్రజల్లో భరోసాను కల్పించడం కోసం జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో పోలీసులు కవాతు నిర్వహించారు. వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో సాయుధ పోలీసులు యూసుఫ్‌గూడ,ఎల్‌ఎన్‌నగర్,కృష్ణానగర్ తదితర బస్తీల్లో కవాతు నిర్వహించారు. శాంతి భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని, ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాల్సిందే అని డీసీపీ జోయల్ డేవిస్ అన్నారు. రౌడీషీటర్ల కదలికలతో పాటు ట్రబుల్ మాంగర్స్ మీద నిరంతరం నిఘా ఉంటుందని హెచ్చరించారు.



జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలోని యూసుఫ్‌గూడలో నిర్వహించిన కవాతులో పాల్గొన్న వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్

### రేపటినుంచి శ్రీ అయ్యప్పస్వామి ఆలయం

## కుంభాభిషేక మహోత్సవాలు

బంజారాహిల్స్,అక్టోబర్ 30: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో కొలువు తీరిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయం ద్వితీయ పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు నవంబర్ 1నుంచి 5 వరకుకా కనులపండువగా నిర్వహించనున్నామని ఆలయ ఈవో లావణ్య తెలిపారు. ఇటీవల ఆలయాన్ని పునర్నిర్మించిన సందర్భంగా ఐదురోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా నవంబర్ 1న పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యాశంకరభారతీ స్వామి చేతులమీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. 2న శ్రీ దత్త విజయానంద తీర్థస్వామి చేతులమీదుగా మహా సుదర్శన హోమం, వేదపారాయణం నిర్వహిస్తారన్నారు. 3న తుని తపోవన పీఠాధీశ్వరులు శ్రీ సద్గురు సచ్చిదానంద సరస్వతీ స్వామి చేతులమీదుగా కుంభాభిషేకం, బ్రహ్మశ్రీ కృష్ణణ్ నంభూద్రి బృందంతో భగవతీసేవ, 4న శ్రీ రుద్రసహిత మహా మృత్యుంజయ హోమం, 5న శబరిమలై ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కంఠరారు మహేష్ మోహన తంత్రి చేతులమీదుగా ధ్వజ స్థంభ,ఆలయ శిఖర, యంత్ర ప్రతిష్ట నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం అయ్యప్పస్వామికి పల్లకీ సేవ నిర్వహించనున్నారని ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు.

## జైలుకు వెళ్లొచ్చినా మారని బుద్ధి.. దొంగ అరెస్టు

వెంగళరావునగర్, అక్టోబర్ 30 : జైలుకెళ్ళొచ్చినా ఓ దొంగ తన బుద్ధి మార్చుకోలేదు.. తిరిగి దొంగతనాలకు పాల్పడటంతో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్ పోలీసు స్టేషన్ ఎస్సై ఉదయ్ వివరాల ప్రకారం..ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్ నగర్‌కు చెందిన కొమ్ము సుధాకర్ (35) దొంగతనాలు చేస్తూ..చోరీ సొమ్ముతో మ ద్యం సేవించేవాడు. కాగా.. బోరబండకు చెందిన జి.రాజు అంబేద్కర్ నగర్‌లో ఆయుర్వేద క్లినిక్‌ను నిర్వహించేవాడు. ఈ క్లినిక్ పక్కన నివాసం ఉండే సుధాకర్ గతంలో మూడు సార్లు క్లినిక్ తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు క్షమించాలని కోరడంతో క్షమించినా మళ్లీ చోరీలకు పాల్పడ్డాడు. గతంలో ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో బైక్,ఆటో చోరీలు, అల్లర్ల వంటి 5 కేసుల్లో అరెస్ట్ అయి జైలుకు వెళ్ళొచ్చాడు.
మళ్లీ క్లినిక్ తాళాలు పగులగొట్టి..లోపలకి జోరబడిని సుధాకర్ అల్మారాలో దాచిన రూ.45 వేలు అపహరించుకెళ్లాడు. బాధితుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగ సుధాకర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ మేరకు మ ధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ముగిసిన కార్టూన్ శిక్షణ శిబిరం



కార్టూన్ శిక్షణలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాసచారి తదితరులు

బంజారాహిల్స్, అక్టోబర్ 30 : చదువుతో పాటు విద్యార్థులలో ఆసక్తిని గుర్తించి డ్రాయింగ్, పెయింటింగ్, కార్టూనింగ్ తదితర కళల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం డైరెక్టర్ ఎస్.శ్రీనివాసచారి అన్నారు. ప్రముఖ కార్టూనిస్ట్ డా.విజయ్ కుమార్ ద్యాప ఆధ్వర్యంలో భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శ్రీనగర్ కాలనీలోని భారత భారతి కాన్సెప్ట్ స్కూలోని విద్యార్థులకు పది రోజుల పాటు నిర్వహించిన కార్టూన్ శిక్షణా కార్యక్రమం ముగింపు సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన శ్రీనివాసచారి ఉత్తమ ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

# ఓటరు నమోదుకు నేడే ఆఖరు

### అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జూబ్లీహిల్స్, అక్టోబర్ 30 : అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటరు నమోదుకు మంగళవారం ఆఖరు అయినందున అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబర్ 31 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమో దు చేసుకోవాలన్నారు. నవంబర్ 30న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇంటింటికీ ఓటు ప్రాధాన్యతపై స్టిక్కర్లు అంటిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌లో మీ ఓటు ఉందో లేదో చెక్ చేసుకోవాలని.. లేనిపక్షంలో ఈరోజే ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఇంటింటికి 'ప్రౌడ్ టూ బీ ఎ ఓటర్' స్లిప్‌లను అంటించారు.



ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

## పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

జూబ్లీహిల్స్, అక్టోబర్ 30 : పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరమని ఏఎంఓహెచ్ డాక్టర్ కె.ఎస్.రవి అన్నారు. సోమవారం డీసీ సేవా ఎస్లావత్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పర్యటించి.. పారిశుధ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ.. ఆయా దుకాణాల ముం దు చెత్తను డబ్బాల్లో ఉంచాలని.. దానిని స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బందికి తమవంతు సహకారాన్ని అందించాలన్నారు. ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్ట్ సంతోష్ , తదితరులు పాల్గొన్నారు.

## సినిమా మేనేజర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబర్ 30: సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్ నేత ఇంటికెళ్లి దౌర్జన్యానికి పాల్పడిన సినీ మేనేజర్ మీద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్ కాలనీలోని కమలాపురి కాలనీకి చెందిన కాట్రగడ్డ సుధాకర్ సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఆయన నివాసం వద్దకు ఆదివారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో అదే యూనియన్‌కు చెందిన సభ్యుడు, మేనేజర్ జి.హరినాథ్ వచ్చి నానా హంగామా సృష్టించాడు. ఓ సెల్ఫీ వీడియో తీసుకుని సుధాకర్‌ను అంతుచూస్తానని బెదిరించాడు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న పెద్దరాయిని తీసుకుని సుధాకర్ కారుపై వేసి ధ్వంసం చేశాడు. దమ్ముంటే బయటకు రా అంటూ నానా బీభత్సం సృష్టించాడు. ఈ మేరకు హరినాథ్‌పై చర్యలు తీసుకోవాలంటూ సుధాకర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన హరినాథ్ తెలుగు సినిమా పరిశ్రమలో పలువురు ప్రముఖ హీరోయిన్లకు మేనేజర్‌గా వ్యవహరించినట్లు తెలిసింది.

## వరల్డ్ స్ట్రోక్ డేపై అవగాహన

బంజారాహిల్స్,అక్టోబర్ 30: వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్స్‌లో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంట్రవెన్షనల్ న్యూరాలజిస్ట్, స్ట్రోక్ స్పెషలిస్ట్ డా. మహ్మద్ అథీకర్ రహ్మాన్ ఆధ్వర్యంలో స్ట్రోక్ వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, స్ట్రోక్ లక్షణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముఖం, చేయి. కాలు తిమ్మిరెక్కడం, అకస్మాత్తుగా కంటి చూపు మందగించడం, మాట్లాడడంలో ఇబ్బంది, శరీరం బ్యాలెన్స్ తప్పిపోవడం తదితర లక్షణాలు కనిపించిన వెంటనే వారిని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. స్ట్రోక్ వచ్చిందని గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీఈవో డా. సాయి రవిశంకర్, వైస్‌చైర్మన్ వేదుల సత్యనారాయణ పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి ఏడుగురు అరెస్ట్

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): హిమాయత్‌నగర్‌లోని ఒక ఇంటిని అడ్డాగా చేసుకొని పేకాట ఆడుతున్న గ్యాంగ్‌ను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నారాయణగూడకు చెందిన గౌతమ్ జైన్ వ్యాపారి హిమాయత్‌నగర్‌లోని ఓ ఇంట్లో పేకాట నిర్వహిస్తున్నాడు. ఒక్కొక్కరి నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేసి, మినీ పేకాట క్లబ్‌గా ఆ ఇంటిని మార్చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు ఫంటర్లు మహేశ్ కుమార్ దూత్, సునీల్ కుమార్, వినోద్‌కుమార్ పటక్, దీపక్‌కుమార్ భహెతి, జైస్వాల్ సుదీప్, ముగిలి సూర్య ప్రకాశ్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.05 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును తదుపరి దర్యాప్తు నిమిత్తం నారాయణగూడ పోలీసులకు అప్పగించారు.

## పారదర్శకంగా ఎన్నికలు జరగాలి

ఖైరతాబాద్, అక్టోబర్ 30 : రాష్ట్రంలో జరిగే ఎన్నికలు పారదర్శకంగా ఉండాలని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక అభిప్రాయపడింది. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేదిక ప్రతినిధులు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎన్నికలు డబ్బుల చూట్టే తిరుగుతుందని, ఓటర్లు అమ్ముడుపోతున్నంత కాలం నాయకులు కొంటూనే ఉంటారన్నారు. ముందుగా ఓటర్లలో మార్పు రావాలని, తమ ప్రాంతాన్ని నిజాయితీగా అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఓటర్ల చైతన్య కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రలోభాలు, మ్యానిఫెస్టో తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓటు ఓ ఆయుధంలా పనిచేస్తుందన్నారు. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో జాతీయ ఓబీసీ సంఘం అధ్యక్షులు కె. కోటేశ్వర్ రావు, అన్వర్ పటేల్, ఆనందరావు, హరినాథ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## డోబ్ సీఈవోతో ఓయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ముఖాముఖి నేడు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో ప్రముఖ ఎంఎన్‌సీ అడోబ్ సీఈవో శంతను నారాయణ్ మంగళవారం నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆయన ఓయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థి కావడం విశేషం. కళాశాలలోని అసెంబ్లీ హాల్‌లో ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు వారికి ఉన్న అవకాశాలపై ఆయన వివరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## గురుద్వారలో పూజలు..

వెంగళరావునగర్, అక్టోబర్ 30: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్ సోమవారం వెంగళరావునగర్‌లోని శ్రీగురురాందాస్ జీ మహారాజ్ గురుద్వార సాహిబ్‌శ్రీగురురాందాస్ జీ 489 వ జయంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సద్ సంగత్‌జీ గురుద్వారా ప్రబంధ కమిటీ ఆధ్వర్యంలో గురు గ్రంథ సాహిబ్‌జీ మహారాజ్ ఆశీర్వాదం తీసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాగంటి ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచి మంత్రి పదవి పొందాలని ప్రార్థనలు చేశారు.